క్లుప్తంగా

అమ్మవారి సన్నిధిలో కలెక్టర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో దుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన కలెక్టర్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో కెఎస్.రామారావు దంపతులు కలెక్టర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఏఈఈవో చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక మహోత్సవాలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళావేదికపై తొమ్మిది రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. పక్షి మంజూష బృందం వినాయక వందనం, కామాక్షిస్తుతి, అయిగిరి నందిని అంశాలను ప్రదర్శించారు. నిర్వాహకులు సైదా, గంగాధర్, రామకృష్ణ కళాకారులకు ప్రశంసా పత్రాలను అందించారు.

గ్రంథాలయంలో సమావేశ మందిరం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో చేపట్టిన మరమ్మతులలో భాగంగా పునర్ నిర్మించిన సమావేశ మందిరాన్ని మంగళవారం గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం దసరా సందర్భంగా గ్రంథాలయంలో ఆయుధ పూజ చేశారు. 100 సీటింగ్ కెపాసిటీతో సమావేశ మందిరాన్ని నిర్మించినట్లు చెప్పారు. గ్రంథాలయంలో నిర్వహించే కార్యక్రమాలకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. పుస్తకావిష్కరణ, సాహితీ సమావేశాలు, వ్యక్తిత్వ వికాస తరగతులు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ కార్యదర్శి కేశవరావు, గ్రంథాలయ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు సభ్యులు తంగిరాల రఘురాం, చిగురుపాటి నరేష్, మద్దినేని పవన్, జె. పద్మ, కోటా శ్రీకృష్ణ భగవాన్, లైబ్రేరియన్ కె. దుర్గా దేవి ఇతర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలియోను నిర్మూలిద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ వ్యాప్తంగా పోలియోను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్ తెలిపారు. అక్టోబర్ 24 ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకూ నిర్వహించిన ఈ ర్యాలీని సాధుప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో దినోత్సవం సందర్భంగా.. నగరంలో పోలియో నిర్మూలన అవగాహన నడకను మిడ్ టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అజయ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త జీవితం సర్వమానవాళికి ఆదర్శం

ఆటోనగర్(విజయవాడతూర్పు): మహ్మద్ ప్రవక్త జీవితం సర్వమానవాళికి ఆదర్శనీయమని జమ అతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీఖ్ అన్నారు. రెండు రోజులుగా విజయవాడలో ప్రవక్త మహ్మద్ సల్లల్లాహు అలైహి సల్లం జీవితం – ముస్లిం సమాజం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఫీఖ్ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన మానవ మహోపకారి అని, అందరి దైవం ఒక్కడే అని అన్నారు. కార్యక్రమంలో మౌలానా ముఫ్తీ సయ్యద్ ముహ్సిన్, మౌలానా ముఫ్తీ అబ్దుర్రహీం, మౌలానా హుస్సేన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

• తెప్పోత్సవం.. జన సమ్మోహనం

వైభవోపేతంగా సాగిన తెప్పోత్సవంతో కృష్ణాతీరం పులకించింది. లోకపావని దుర్గమ్మ, ఆ పక్కనే గంగామల్లేశ్వరులు హంసవాహనంపై కొలువుదీరి, రంగు రంగుల విద్యుత్ దీప కాంతులు, మిరుమిట్లు గొలిపే బాణాసంచా వెలుగుల మధ్య అలల దారుల్లో విహరిస్తుంటే.. గట్టున ఉండి ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తకోటి పులకించిపోయింది. శరన్నవరాత్రుల్లో కీలకఘట్టం తెప్పోత్సవం సోమవారం రాత్రి వేడుకగా జరిగింది. మంగళవారం కూడా ఇంద్ర కీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగింది. సుదూర ప్రాంతాల నుంచి భవానీలు పెద్ద సంఖ్యలో అమ్మవారి సన్నిధికి తరలివస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ















జయ జయహే జననీ

వైభవంగా ముగిసిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



అయోధ్యనగర్‌లో గ్రామోత్సవం



దాసాంజనేయస్వామి వారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దుర్గాపురంలో శమీవృక్షపూజ



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



శివరామకృష్ణ క్షేత్రంలో గజలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. సోమవారం అమ్మవారు మహిషాసురమర్దినీదేవి, రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తుల పూజలు అందుకున్నారు. సాయంత్రం శమీ పూజ చేసి తరించారు.

- అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో సోమవారం అమ్మవారు ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మహిషాసురమర్దినీ, శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారలో భక్తుల పూజలు అందుకున్నారు. తొమ్మిదిరోజులుగా లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న హోమం పూర్ణాహుతి జరిగింది. మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, శ్రీ శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహించారు.
- దుర్గాపురంలో వీరమాచనేని లలిత ఆధ్వర్యాన సోమవారం అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- రామలింగేశ్వరపేట ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో అమ్మవారిని సోమవారం రాజరాజేశ్వరిదేవిగా అలంకారం చేసి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మంగళవారం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది.
- ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకారం చేసి కుంకుమార్చనలు చేశారు.
- గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు
- మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తి పీఠంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేసి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.
- బావాజీపేట నాలుగోలైనులో దేవీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు.
- మధురానగర్ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. అలాగే మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అంంకరించి శమీవృక్షపూజ నిర్వహించారు.

ముగిసిన ఉత్సవాలు..

విజయవాడ కల్చరల్: శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు ముగిశాయి. మంగళవారం బాలా త్రిపుర సుందరీదేవిని రాజరాజేశ్వరిగానూ, శారదాంబను గజలక్ష్మిగానూ, మహాలక్ష్మిని వైష్ణవిగానూ అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదాంబా దర్బార్‌లో శమీ పూజను నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8 గంటలకు అమ్మవార్లను సత్యనారాయణపురంలోని వీధిల్లో శోభాయాత్ర నిర్వహిస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

విజయవాడ కల్చరల్: ప్రభుత్వం చిత్తశుద్ధి, ప్రభుత్వ శాఖల సమన్వయంతో దసరా మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విశ్వమాతా చారిటబుల్ సంస్థ, కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి ఆధ్వర్యంలో శంకరమఠంలో నిర్వహిసున్న దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లగా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించిందన్నారు. విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ యజ్ఞాలు, యాగాలు, క్రతువులు చేయడం వల్ల లోక శాంతి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకురాలు పరచూరి విజయలక్ష్మి మహిళలను ఘనంగా సత్కరించారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ సంఖ్యలో వాహన చోదకులు స్వామివారిని దర్శించుకుని వాహన పూజలు చేయించుకున్నారు.

ఘనంగా బాబా పుణ్యతిథి మహోత్సవం



నాగమానసా అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మల్లాది



పూర్ణాహుతిలో పాల్గొన్న డాక్టర్ పూనూరుగౌతంరెడ్డి దంపతులు



మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): షిర్డీ నాగసాయి బాబాను నమ్మిన భక్తులకు అంతా మంచే జరుగుతుందని, బాబా అనుగ్రహంతో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు లభిస్తాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మంగళవారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా–నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో షిర్డీ సాయిబాబా 105వ పుణ్యతిథి, మహాసమాధి మహోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యాన సాయిబాబాకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఆవు పిడకలు, నెయ్యి, నవధాన్యాలు ధునిలో వేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బాబాను దర్శించుకుని హారతి ఇచ్చారు. మందిర నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజల అనంతరం సుధాస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విష్ణును భక్తులు శాలువాతో సత్కరించి, బాబా సచ్చరిత పారాయణం, షిర్డీ బాబా ఫొటోను అందజేశారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రి ఉత్సవాల్లో ఆలయంలో సేవలు అందించిన భక్తులకు మందిర నిర్వాహకులు సుధాస్వామి–జీవకుమారి వస్త్రాలు, పసుపుకుంకుమ, బాబా ఫొటోలను బహూకరించారు.

షిర్డీ సాయినాథుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం బాబా పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బాబా సమాధి నమూనాను పూలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆలయకమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం పుణ్యతిథి మహోత్సవం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేశారు.
- పసుపుతోట దత్తసాయి మందిరంలో మంగళారం షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవం ఘనంగా జరిగింది. బాబా వారి సమాధిని పూలతో అలంకరించి పూజలు చేశారు.

జగనన్నే మళ్లీ కావాలి

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసి, అన్ని రంగాలలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించిన మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ మనకు ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్రంలోని ముస్లిం ప్రజానీకం అంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు.

సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ముస్లింలకు ఒక డెప్యూటీ సీఎం, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వందలాది నామినేటెడ్ పోస్టులు కల్పించి ముస్లిం మైనార్టీలకు మన సీఎం జగనన్న ఎనలేని గౌరవ మర్యాదను అందించారన్నారు. అందుకే తమకు జగనన్నే మళ్లీ కావాలని ముస్లింలు కోరుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సోదరులను తన కుటుంబ సభ్యులుగా చూస్తున్నందుకు జగనన్నే మాకు మళ్లీ కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుతున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యాధికారమే లక్ష్యంగా నవంబర్ 26వ తేదీ నుంచి మన సీఎం జగనన్న తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర మరో నవ చరిత్రను లిఖించడం తథ్యమని, ఈ యాత్రలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నాయకుల పిచ్చి చేష్టలు..

అవినీతికి పాల్పడి జైల్లో ఉన్న చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ రాష్ట్రంలో టీడీపీ నాయకులు పిచ్చి చేష్టలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు మీద ఎందుకు అంత ప్రేమో అర్థంకావడం లేదన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని, రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు.

15 రోజుల్లో ఖబరస్థాన్ పనులు ప్రారంభం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్‌నగర్ ఖబరస్థాన్‌లో నెలకొన్న సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపుతూ 15 రోజుల వ్యవధిలోనే అక్కడ అభివృద్ధి పనులకు శ్రీకరారం చుడతామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా హామీ ఇచ్చారు. సింగ్‌నగర్ ఫ్లైఓవర్ రోడ్డులోని ఖబరస్థాన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని 15 మసీదులకు సంబంధించిన ముస్లిం పెద్దలు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని వినతిపత్రాన్ని అందించారు. ఫ్లైఓవర్ రోడ్డు నుంచి వాంబేకాలనీకి వెళ్లే రోడ్డులో ఉన్న ముస్లిం శ్మశాన వాటిక సమస్యలకు నిలయంగా మారిందని ముస్లిం పెద్దలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, ముస్లిం మైనార్టీల పెద్దలు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, షేక్ వెంకట్, జిలాని, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.